క్లుప్తంగా

యూజీడీ పనులకు శంకుస్థాపన

బాలానగర్: ఫతేనగర్ డివిజన్‌లోని న్యూ గౌతమ్‌నగర్‌లో రూ.18లక్షలతో చేపట్టనున్న యూజీడీ పనులకు కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ బుధవారం జలమండలి అధికారి అనిల్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.... ఇటీవల ఎమ్మెల్యే చేపట్టిన పాదయాత్రలో స్థానికులు ఈ సమస్యను పరిష్కరించాలని కోరారన్నారు. వెంటనే అధికారులతో చర్చించి ప్రత్యేక నిధులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంజూరు చేయించారని తెలిపారు. యూజీడీ పనులు పూర్తయిన వెంటనే సీసీ రోడ్డు పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దత్తరావు, అనిల్, భాగయ్య, జహీర్, పండు, శశాంక్, ఆలీ, బాలరాజ్, పూర్ణచందర్‌రావు, చైతన్య, అఫ్జల్, కె.లక్ష్మి, రహిమ, బాలమణి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన రిపబ్లిక్ రాయబారి

రాయదుర్గం: డొమినికల్ రిపబ్లిక్ భారతదేశంలోని రాయబారి డేవిడ్ ప్యూగ్ గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీని బుధవారం సందర్శించారు. హెచ్‌సీయూలోని ఎస్పైర్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను కార్యదర్శి బియాంకా బేజ్ సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని స్టార్టప్‌లతో వారు ముచ్చటించారు. అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలు, ఎదిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావుతో ఈ బృందం ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఎస్పైర్ బయోనెస్ట్‌ను ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో ఏర్పాటు చేయడం, డైనమిక్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను ప్రోత్సహించడానికి ప్రతిష్టాత్మక కార్యక్రమాల గురించి వారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీతో సమావేశమై విద్యాభివృద్ధి, కొత్త కోర్సుల ఏర్పాటు, ఉపాధి అవకాశాలపై తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో నాలుగురోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ వర్క్‌షాప్, ఖగోళ శాస్త్ర డేటా విశ్లేషణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. క్యాంపస్ లోని లైబ్రరీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షత వహించి ఈ సదస్సు ప్రాధాన్యతను వివరించారు.

'మనూ'లో హిందీ దివాస్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో హిందీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ వరకు 'హిందీ దివాస్' కార్యక్రమాన్ని కొనసాగిస్తారు. 'అడ్మినిస్ట్రేటివ్ విషయాలు: నోటింగ్, డ్రాఫ్టింగ్' అనే అంశంపై హిందీ వర్క్‌షాప్ నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని అధికార భాషా విభాగం సహాయ సంచాలకులు డాక్టర్ సీమా వర్మ ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికార భాష హిందీ అమలు గురించి ఆమె వివరించారు.

వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు
- అంజీర్ చెరువు వద్ద ఏర్పాటు చేసిన బేబీ పాండ్‌ల పరిశీలన


అంజీర్‌చెరువు వద్ద నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాసరావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ అంబీర్ చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన బేబీ పాండ్‌ను బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ శివ భాస్కర్, సీఐలు వెంకటేష్, నరసింహారావు, ఎస్సై సందీప్, వినయ్‌రావులతో కలిసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాసరావు అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాట్లను పకడ్బందీగా చేయనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా నిమజ్జనానికి వచ్చే వాహనాలకు రూట్ మ్యాప్ రూపొందిస్తామని తెలిపారు.

➡ ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు మాట్లాడుతూ... వినాయక నిమజ్జనం సజావుగా, సంప్రదాయబద్ధంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా భక్తులు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నిమజ్జనం ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జన పాయింట్ వద్ద బారీ కేడింగ్, లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఒకొక్క పాయింట్ వద్ద రెండు పెద్ద క్రేన్లు, ఒక చిన్న క్రేన్ ఏర్పాటు చేయాలని సూచించారు.

➡ పాండ్‌లో తగినంత నీరు ఉండేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గజ ఈతగాళ్లను మూడు షిఫ్టులలో నియమించాలన్నారు. మెడికల్ క్యాంపు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉంచాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా అధికారులు చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఏఈ రాజీవ్, ఎలక్ట్రికల్ ఏఈ షాబాజ్, జలమండలి మేనేజర్ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, ఎస్ఎఫ్ఏ వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు పరిసరాలను పరిశీలించిన వివిధ శాఖల అధికారులు


ఐడీఎల్ చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ అధికారులు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై పోలీస్, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారులు బుధవారం చర్చించారు. డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, మూసాపేట ఉపకమిషనర్ రమేష్, ఎస్‌డబ్ల్యూఎం డీసీ మోహన్‌రెడ్డి, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ శ్రీనివాస్ చెరువు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ... వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో ముందుకెళ్తున్నామని అన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రూట్‌మ్యాప్‌ను రూపొందిస్తామన్నారు. మహిళలకు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. ఐడీఎల్ చెరువు కట్టపై పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బేబీ పాండ్‌లలో మంచినీరు నింపి చిన్న విగ్రహాలను నిమజ్జనం చేస్తామన్నారు. విగ్రహాల నిమజ్జనం త్వరగా అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శివభాస్కర్, సీఐ సురేందర్, కూకట్‌పల్లి ట్రాఫిక్ సీఐ నగేష్, బాలానగర్ ట్రాఫిక్ సీఐ నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద మాదిగ


కూకట్‌పల్లి వై జంక్షన్‌లో దీక్ష చేస్తున్న నాయకులకు సంఘీభావం తెలుపుతున్న గోవిందు మాదిగ

కూకట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం అత్యవసరంగా జరుపుతున్న 5 రోజులు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత ప్రధాన ఎజెండాగా ఉండేలా చూడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం కూకట్‌పల్లి వై జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద ముత్యపాగ శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుల నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు.

➡ ఈ సందర్భంగా గోవిందు మాదిగ మాట్లాడుతూ... ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తే కేంద్ర ప్రభుత్వంపై పైసా భారం పడదన్నారు. ఆర్థిక భారం అసలే ఉండదని.. అదనంగా రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం కూడా లేదని తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో ఏ కులానికి, ఏ మతానికి నష్టం జరగదని పేర్కొన్నారు. ఈ పార్లమెంట్ సమావేశంలో మొదటి బిల్లుగా ఎస్సీ వర్గీకరణను ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం జగదీష్ మాదిగ, సీనియర్‌నేతలు నరసింహా, సాల్మన్ పాల్గొన్నారు.

'రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోంది'


ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న బీజేపీ నాయకులు సురభి, స్రవంతి

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్‌రావు, బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు స్రవంతి నేతృత్వంలో బుధవారం 4వ రోజు జయానగర్ నుంచి పాదయాత్ర చేపట్టారు. రాఘవేంద్ర కాలనీ, ఆల్విన్‌కాలనీ ఫేజ్-1, ఉషోదయకాలనీ వరకు సాగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ... ప్రజలందరు ప్రధాని నరేంద్రమోదీ పాలన పట్ల ఆకర్షితులై బీజేపీని గెలిపించుకోవాలన్న దృఢ నిశ్చయంతో ఉన్నారన్నారు. 9 సంవత్సరాలు పైబడి దేశంలో పాలించిన బీజేపీ ప్రభుత్వంలో ఏ ఒక్క అవినీతి జరగలేదన్నారు.

➡ రాష్ట్రంలో నియంతృత్వ నిరంకుశ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. ఓట్ల రాజకీయం తప్ప అభివృద్ధి ఏమి లేదని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ రోజు రోజుకి మరింత పుంజుకొని అధికారం సాధించే దిశగా సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేందర్‌రెడ్డి, కుమార్ యాదవ్, మణిభూషణ్, కేశంరావు, శ్రీనాథ్, స్వప్న, మునిషా, సునీత, అనిత, నరసింహారెడ్డి, సుబ్బారావు, రమణ, నీలంబర్, అనిల్, దుర్గ, సాయి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై సీరియస్

- జీపీల్లో వందలాది అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లు
- 16 నుంచి చీర్యాలలో కూల్చివేతలు షురూ..
- భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై అధికార యంత్రాంగం సీరియస్‌గా ఉంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గుర్తించిన అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై గ్రామ కార్యదర్శులు, పురపాలక కమిషనర్ల నుంచి నివేదిక తెప్పించుకున్న అధికార వర్గాలు చర్యలకు సిద్ధమవుతోంది. కీసర మండలం చీర్యాలలో ఎలాంటి అనుమతులు పొందకుండా.. ఏడాది కాలంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను గుర్తించిన గ్రామ పంచాయతీ యంత్రాంగం ఇప్పటికే 25 అక్రమ నిర్మాణాలను ఉద్రిక్త పరిస్థితుల మధ్య కూల్చివేసింది. మిగిలిన 30 అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు ఈ నెల 16 నుంచి హెచ్ఎండీఏ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపుతోంది. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసుల సహకారాన్ని కూడా కోరినట్లు తెలుస్తోంది. అలాగే, ఇదే మండలంలోని గోధుమకుంట, రాంపల్లి దాయర, కీసర గ్రామాలతో పాటు ఘట్‌కేసర్ మండలంలోని కాచివానిసింగారం, ప్రతాపసింగారం, చౌదరిగూడ, కొర్రెముల, ఏదులాబాద్, అవుషాపూర్, అంకుషాపూర్‌లలో కూడా అక్రమ నిర్మాణాలు, లే అవుట్లు ఉన్నట్లు గుర్తించిన యంత్రాంగం చర్యలకు ఉపక్రమిస్తోంది. జిల్లాలో గ్రామ పంచాయతీల్లో మండలాల వారిగా కీసర మండలంలో 26, శామీర్‌పేట్ మండలంలో 25, మేడ్చల్‌లో 22, ఘట్‌కేసర్ మండలంలో 13, మూడు చింతలపల్లి మండలంలో 10 అక్రమ లేఅవుట్లు ఉండగా, వందలాదిగా అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు కలెక్టర్‌కు నివేదించిన జాబితాలో సంబంధిత అధికారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై చర్యలు తీసుకోవాల్సిన కొంత మంది ఉద్యోగులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై కూడా జిల్లా యంత్రాంగం సీరియస్‌గా ఉంది. అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై సమగ్రమైన నివేదిక అందజేయని గ్రామ కార్యదర్శులు, ఎంపీఓలపై కూడా చర్యలపై ఉపక్రమిస్తున్నట్లు తెలుస్తోంది.

పుస్తక పఠనం, చిత్రలేఖనం పోటీలు


బహుమతులు అందుకున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3 నుంచి 5 తరగతి విద్యార్థులకు మాతృభాషలో పుస్తక పఠనం, చిత్రలేఖనం అంశాలలో పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఫౌండేషన్ సహ కార్యదర్శి అప్పాజీ శ్రీనివాస్, హెచ్ఎం అరుణ బుధవారం బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం అప్పాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పుస్తక పఠనం చాలా ముఖ్యమని నిరంతరం అభ్యాసం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు అప్పాజి శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించారు. పుస్తక పఠనంలో దీక్షిత ప్రథమస్థానం, సాకేత్ ద్వితీయ స్థానం, సాకేత్ మూడో స్థానం, అక్షర నాల్గో స్థానంలో నిలిచారు. చిత్రలేఖనంలో హర్షిత, యగ్నిక, సుకుమార్ మొదటి మూడు బహుమతులు అందుకున్నారు.

డివిజన్‌లో అభివృద్ధి పనులన్నీ పూర్తిచేశాం


ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఛత్రపతి శివాజీనగర్, అనసూయమ్మ, మహంకాళినగర్, ఆశానగర్, ఇంద్ర హిల్స్, సాయిచరణ్‌కాలనీ, ఇంద్రనగర్ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అధికారులతో బుధవారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సమస్యల పరిష్కారానికి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్‌లో అభివృద్ధి పనులన్నీ 90శాతం పూర్తి చేశామన్నారు. కాలనీల్లో కొంతమేర పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. మ్యాన్‌హోల్స్ మూతలు, విద్యుత్ దీపాలు, వైర్లు వంటి చిన్న సమస్యలను అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలతో రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, కాశీనాథ్ యాదవ్, చిన్నోళ్ల శ్రీనివాస్, గుడ్ల శ్రీనివాస్, శివరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఈ-కేవైసీ లేకుంటే.. రేషన్ కట్..



- వేలి ముద్రతో నమోదు తప్పని సరి
- రేషన్ కార్డుల్లో అనర్హుల ఏరివేతపై చర్యలు
- జిల్లాలో మొత్తం 5.24 లక్షల రేషన్ కార్డులు
- సభ్యుల సంఖ్య(యూనిట్లు) 17,20,035

సాక్షి, మేడ్చల్ జిల్లా: మీ కుటుంబానికి రేషన్ కార్డు ఉందా.. ఉంటే అందులో పేర్లు ఉన్న వారందరూ ఒకసారి రేషన్(షాపు) దుకాణానికి వచ్చి వేలిముద్ర వేసి, కేవైసీ(నో యువర్ కస్టమర్) నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఏ కారణంతోనైనా రాలేకపోయినా, కుటుంబ సభ్యులు చనిపోయినా ఆ మేరకు మీ కార్డులో బియ్యం కోటా తగ్గిపోతోంది. రేషన్ బియ్యం తప్పుదారి పట్టకుండా నివారించడానికి, అర్హులకే రేషన్ బియ్యం అందించడానికి ప్రభుత్వం ఈ చర్యలకు శ్రీకారం చుట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా రాయితీలను భరించి పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నాయి. ఆహార భద్రత(రేషన్) కార్డులో పేర్కొన్న సభ్యులు ఒక్కొక్కరికి ప్రస్తుతం ఆరు కిలోల చొప్పున బియ్యం అందజేస్తున్నాయి. కార్డులో పేరున్న ఏ ఒక్క వ్యక్తి చౌక ధరల(రేషన్ షాపు) దుకాణానికి వెళ్లినా సదరు కార్డులో పేర్కొన్న యూనిట్ల ప్రకారం రేషన్ బియ్యం అందిస్తున్నారు.

◆ రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి రేషన్ కార్డుల్లో నమోదైన సభ్యుల పేరిటే బియ్యం పంపిణీ చేస్తున్నారు. కొన్ని కార్డుల్లోని కుటుంబ యజమాని లేదా సభ్యులు చనిపోయారు. కూతుళ్లు వివాహాలు చేసుకుని అత్తారింటికి వెళ్లిపోయారు. కుమారులు పెళ్లి చేసుకుని ఉద్యోగం, ఉపాధి పేరిట ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అయినా కార్డుల్లో పేర్లు అలాగే కొనసాగుతున్నాయి. నిరుపేదల ఆకలి తీర్చేందుకు అందిస్తున్న ప్రజాపంపిణీ బియ్యం.. దుర్వినియోగం కాకుండా చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ప్రతి రేషన్ కార్డులోని సభ్యులందరి పేర్లు ధ్రువీకరించుకునేందుకు వారి వేలిముద్రలు సేకరించి కేవైసీ పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రేషన్ కార్డులో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని చౌకధరల దుకాణానికి వెళ్లి ఈ-పాస్ మిషన్‌లో వేలిముద్రలు వేసి, కేవైసీ నమోదు చేసుకోవాలని ఆదేశించారు. కేవైసీ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. కేవలం రేషన్ దుకాణాల్లో మాత్రమే వేలిముద్రలు సేకరించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డీలర్లు సైతం తమ దుకాణాల పరిధిలోని కార్డుదారులకు సమాచారం అందించి ఒకేసారి కుటుంబ సభ్యులంతా వచ్చి వేలిముద్రలు వేసుకుని తమ కేవైసీ పునరుద్ధరించుకునేలా చూడాలని కోరారు.

ఈ-కేవైసీ నమోదు ఇలా..

◆ రేషన్ కార్డు ఉన్న కుటుంబ యజమానితోపాటు కార్డులో పేర్లు ఉన్న కుటుంబ సభ్యులంతా సమీప చౌకధరల దుకాణానికి వెళ్లి ఈ-పాస్ మిషన్‌లో వేలిముద్రలు వేయాలి. వేలి ముద్ర వేయగానే రేషన్ కార్డు నంబర్‌తో పాటు సభ్యుల ఆధార్ కార్డు నంబరు చూపిస్తోంది. వీటిని సరి చూసిన తర్వాత ఆకుపచ్చ రంగు వెలిగి సదరు సభ్యుల కేవైసీ పునరుద్ధరణ జరుగుతుంది. ఒకవేళ ఈ పాస్ మిషన్‌లో ఎరుపు రంగు వస్తే సదరు వినియోగదారుడి రేషన్ కార్డు, ఆధార్ సరిపోల్చలేమంటూ రిజెక్టు సూచిస్తుంది. దీంతో ఒక(సభ్యుడు) యూనిట్ రేషన్ కార్డు నుంచి తొలగింపునకు గురవుతారు.

రేషన్ కార్డులిలా..

◆ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వివిధ కేటగిరీల వారీగా 5,24,153 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 17,20,035 మంది సభ్యులు(యూనిట్లు) ఉండగా, ప్రతినెలా 10,650.124 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తున్నారు.

కార్డులో పేరుంటే కేవైసీ తప్పనిసరి

ప్రతి రేషన్ కార్డులోని సభ్యులంతా తమ వేలి ముద్రలు నమోదు చేసుకోవాలి. ఉపాధి, ఇతర పనుల నిమిత్తం వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు తమ సమీపంలోని దుకాణానికి వెళ్లి ఈ-పాస్ మిషన్‌లో నమోదు చేసుకోవచ్చు. డీలర్లకు కూడా ఈ విషయంపై పూర్తి అవగాహన కల్పిస్తాం. ఈ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత మార్పులు చేస్తారు. చౌక బియ్యం సరఫరా నిలిచిపోకుండా ఉండాలంటే అంతా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలి.

- విజయలక్ష్మి, డీఎస్ఓ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం

పాదయాత్రంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి


కూకట్‌పల్లి డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యేకు హారతి పడుతున్న మహిళలు


ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు ఓ రూ.10లక్షలు మంజూరు చేయించుకోవాలంటే ఎమ్మెల్యేలు నానా కష్టాలు పడేవారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయలు మంజూరు చేస్తుండటంతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. బుధవారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనాయణతో కలిసి వెంకట్రావునగర్, ప్రకాష్‌నగర్, శాంతి నగర్‌లలో పాదయాత్ర చేపట్టి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

➡ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లి డివిజన్‌లోని పలు కాలనీలు లోతట్టు ప్రాంతాల్లో ఉండటంతో భారీ వర్షాలు కురిసినప్పుడు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. మంత్రి సహకారంతో అధికారుల సమక్షంలో రిటర్నింగ్ వాల్స్ ఏర్పాటు చేసి వర్షపునీరు నాలాలోకి వెళ్లేలా ప్రణాళికలు చేపడతామన్నారు. డివిజన్‌లో 90 శాతం పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

నేటి నుంచి బాలాజీనగర్ డివిజన్‌లో పాదయాత్ర షురూ..

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం నుంచి 20వ తేదీ వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబురావు తెలిపారు. ప్రగతినగర్, ముష్కిపేట్, చిత్తారమ్మ నగర్, శ్రీహరినగర్, టి. అంజయ్య నగర్, శివశక్తి నగర్‌లలో పాదయాత్ర ఉంటుందన్నారు. పాదయాత్రను ప్రగతినగర్ హనుమాన్ గుడి నుంచి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ పాదయాత్రలో నాయకులు, మహిళలు, అనుబంధ, బస్తీ కమిటీ సభ్యులు, పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రూ.45లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం


బాలానగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలో రూ.45లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ బుధవారం ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శ్రీశ్రీనగర్ కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి రూ.15లక్షలు, ఫిరోజ్‌గూడ మండల పరిషత్ పాఠశాల పై అంతస్తు నిర్మాణానికి రూ.30లక్షలతో చేపడుతున్నామని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దశలవారీగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. దేశంలో ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. గడిచిన 9 ఏళ్లలో తెలంగాణ అనేక రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. అప్పట్లో విద్యుత్ కోతలతో ఇబ్బంది పడిన రాష్ట్రం నేడు మిగులు విద్యుత్ సాధిస్తోందని తెలిపారు. నీటి కొరతతో ఇబ్బంది పడకుండా మిషన్ కాకతీయతో రైతులుకు సాగునీరు పుష్కలంగా అందిస్తోందన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తూ పంటల దిగుబడిని భారీగా పెంచిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ బాలకృష్ణా, ఏఈ మొహమ్మద్ రషీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.